క్లుప్తంగా

ప్రతిరోజూ చెత్త సేకరణ జరగాలి

శ్రీకాకుళం రూరల్: ఇంటింటా చెత్త సేకరణ ప్రతిరోజూ జరగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. పెదపాడులోని రామాలయం, పొందర వీధుల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. శానిటేషన్ సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త సేకరణ ఎలా చేస్తున్నారని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కాలనీలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ బీవీడీ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

ఆగస్టు 5న వేలంపాట

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్రిడ్జి పక్కనున్న కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఆగస్టు 5వ తేదీన ఉదయం 10 గంటలకు కొబ్బరి చిప్పల వేలంపాట జరుగుతుందని ఆలయ ఈవో శ్యామలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కొబ్బరిచిప్పలను రెండు సంవత్సరాలకు, అనగా 2025 ఆగస్టు 11 నుంచి 2027 ఆగస్టు 10 వరకు వసూలు చేసుకునే హక్కు కోసం ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ధరావత్తు కింద రూ.10 వేలు చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు. ఇతర విషయాల కోసం ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

రోగులకు ఉత్తమ సేవలందించాలి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం, క్లోపల్లి పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న 26 మంది ఏఎన్‌ఎంలు ఇటీవల జరిగిన బదిలీల నిమిత్తం స్థానిక సింగుపురం పీహెచ్‌సీలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వైద్యాధికారులు ఎక్కడ పనిచేసినా రోగులకు ఉత్తమ సేవలందిస్తూ వారి మన్ననలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు లిల్లీ, చిరంజీవి, చాందినీ, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

3న ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల సమాఖ్య 310వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా బొత్స అప్పలస్వామి (మర్రివలస మాస్టార్) స్మారకార్థంగా ఆగస్టు 3న పౌరాణిక, సాంఘిక, జానపద పద్య ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య సభ్యులు పన్నాల నర్సింహమూర్తి, ఎల్.రామలింగస్వామి తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల నుంచి 44 ఎంట్రీలు రాగా, వారిలో 33 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి బి.రామచంద్రదేవ్, పొట్నూరు వెంకట్రావ్, కలగ ఆదికేశవరావు, బి.జ్యోతి, కంచరాన అప్పారావు, రమణారావు, సత్యవతి, జ్యోతి పాల్గొన్నారు.

గర్భిణులకు కిల్కారీ సేవలు

అరసవల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కిల్కారీ ఫోన్ కాల్ సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.అనిత సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆశ నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల కోసం కేంద్రం వాయిస్ కాల్ సేవలు ప్రవేశపెట్టిందని, 01244451660 నంబర్ నుంచి గర్భిణులకు కాల్ వస్తుందని, లిఫ్ట్ చేస్తే వాయిస్ రూపంలో పలు సూచనలు, సలహాలు, సమాచారం అందుతుందని చెప్పారు. సమాచారాన్ని మళ్లీ వినాలంటే 14423 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ సేవల పట్ల ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఎచ్చెర్ల: మండలంలోని కేశవరావుపేట పంచాయతీ కింతలమిల్లు జంక్షన్‌లో నివాసముంటున్న కూటికుప్పల రత్నాలమ్మ (76) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రత్నాలమ్మ ఈనెల 23వ తేదీన వ్యవసాయ పొలంలో పురుగుల మందు సేవించింది. దీంతో స్పృహ తప్పి పడిపోయిన ఆమెను శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అనంతరం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

ఎచ్చెర్ల: నారాయణవలస సంత నుంచి విజయనగరం జిల్లా అలమండకు రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఒక వాహనంలో 13, మరో వాహనంలో 17 దూడలను తరలిస్తుండగా పట్టుకుని ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. పట్టుబడిన వీటిని విజయనగరం జిల్లా గుర్లలోని గోసంరక్షణా కేంద్రానికి తరలించామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీమా.. భారం..!

- ఉచిత పంటల బీమాను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- రైతులే ప్రీమియం చెల్లించేలా ఉత్తర్వులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే చెల్లించిన వైనం
- కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం


గొంటి వద్ద సాగవుతున్న వరి పంట

గార: ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలన్న నిబంధనను తెరపైకి తీసుకొచ్చింది. ఈ పరిణామం రైతుల్లో ఆవేదన నింపుతోంది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే ప్రభుత్వం తమకు ఏమాత్రం ప్రోత్సాహం ఇవ్వడం లేదని వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి తమకు ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా చేయించేదని గుర్తు చేసుకుంటున్నారు.

నేడు రైతులపైనే భారం

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడింది. ఈ సీజన్ నుంచి పంట సాగుచేసే ప్రతీ రైతు పంట బీమా పొందాలంటే ప్రీమియం తప్పకుండా చెల్లించాల్సిందే. ఎకరాకు రూ.160 లు చెల్లించాల్సి ఉంటుంది. ఆగస్టు 15వ తేదీతో గడువు ముగియనుంది. ఒకవైపు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం అందక పెట్టుబడులకు అప్పులు చేస్తుండగా.. మరోవైపు ప్రీమియం కోసం కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతీ రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఊదరగొట్టారు. తీరా అధికారం వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచిపోయారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు చేశారు. రైతులు సాగుచేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియం ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకున్నారు. సాగు చేసిన ప్రతీ ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన ప్రతీ సందర్భంలోనూ రైతులు నష్ట పరిహారాన్ని పూర్తిస్థాయిలో అందుకునేవారు. కౌలు రైతులకు సైతం పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. దీంట్లో మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా రైతులకు జమ అయ్యేలా చేశారు.

మండలం	వరి విస్తీర్ణం (ఎకరాల్లో..)	రైతులు
గార	17,260	13,400
శ్రీకాకుళం రూరల్/అర్బన్	16,646	9,800

ఉచిత బీమా అమలు చేయాలి



గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేయడం వలన రైతులకు ఎంతో లాభం ఉండేది. పంట నష్టపోయిన వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారాన్ని అందించేది. అయితే ప్రస్తుతం రైతులే ప్రీమియం చెల్లించడం వలన ఆర్థిక భారం పడుతుంది. ఇప్పటికే పంటల దిగుబడులు లేక, గిట్టుబాటు ధర లేక రైతులు సతమతమవుతున్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలి.

– శిమ్మ ధర్మరాజు, మాజీ సర్పంచ్, గొంటి

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించి రైతులపై ఆ భారాన్ని తగ్గించాలి. ఉచిత పంట బీమా అమలు చేస్తే రైతులకు ఎంతో లాభం చేకూరుతుంది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేసింది. ఇప్పటికే పెట్టుబడి సాయం అందక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులపై ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలి.

– మార్పు రమణ, సర్పంచ్, కె.సైరిగాం

మోసం చేయడం చంద్రబాబుకు కొత్తకాదు


చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

- మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకి కొత్తేమీ కాదని, ఆయన రాజకీయ ప్రస్థానం వెన్నుపోటుతోనే మొదలైందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిల్లపేట, పతివాడపాలెం, కోష్ట గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పతివాడపాలెంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక అధిక చార్జీలతో సామాన్యుడిపై భారం వేస్తున్నారని మండిపడ్డారు. అలాగే సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు గొర్లె అప్పలనాయుడు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, నాయకులు మజ్జి రమేష్, దన్నాన హరి, ఆర్.ఎస్.రెడ్డి, నేతల కృష్ణ, ముద్దాడ రాజశేఖర్, డొప్ప రాము, మహంతి రామసత్యం, రెడ్డి విశ్వేశ్వరరావు, పతివాడ సత్యం, కంబాపు నరసింహులు రెడ్డి, అల్ల రాంభూపతి రెడ్డి, పల్లె లక్ష్మణరావు, పైడి రాంబాబు, పిసిని చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


కూటమి ప్రభుత్వ మోసాలపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గార: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి ఆరోపించారు. బుధవారం శ్రీకూర్మంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు అధ్యక్షతన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం అమలు చేయలేమని తెలిసినా అబద్ధపు హామీలను కూటమి నాయకులు ఇచ్చారని మండిపడ్డారు. యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బరాటం నాగేశ్వరరావు, సర్పంచ్ గోరు అనిత, అంధవరపు బాలకృష్ణమూర్తి, బరాటం నాగరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు పృథ్వీరాజ్, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అసెంబ్లీ గ్రీవెన్సు విభాగం అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, అరవల రామకృష్ణ, పీస శ్రీహరిరావు, యాళ్ల నారాయణమూర్తి, కొయ్యాన నాగభూషణం, తెనుకోటి అప్పారావు, చింతల గడ్డెయ్య, కోనాడ నర్సింగరావు, ఊట అప్పలనాయుడు, కుర్మాన మనెమ్మ, బరాటం నాగరాజు, పల్ల పెంటయ్య, పల్ల శ్రీనువాసరావు, రాణ గురయ్య, గోవింద, చుక్క నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం


గూడేంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

శ్రీకాకుళం రూరల్: ప్రజలను మోసగించి గద్దెనెక్కడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్‌రావు అన్నారు. మండల పరిధిలోని రాగోలు, గూడేం గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏడాది కాలంగా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నిరుద్యోగులు, ఆడబిడ్డలను మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, గొండు కృష్ణ, బాణ నర్సింగరావు, రుప్ప అప్పలసూరి, బగ్గు అప్పారావు, గుండ హరీష్, గుండ ఢిల్లీరావు, ఎచ్చెర్ల శ్రీధర్, బొబ్బాది చంద్రమౌళి, గేదెల శంగల్వరావు, యాళ్ల శ్రీను, ఎం.అప్పలరాజు, పెద్దిన హరి, గుండ భాస్కరరావు, గేదెల అప్పారావు, బట్నా కృష్ణ, మట్ట గోవిందరాజులు, దండు అప్పలరాజు, మట్ట నగేష్, బొచ్చిన రాజేష్, చంచు వసంతరావు, చిట్టి లక్ష్మణరావు, కుంచలా భాస్కరరావు, శిమ్మ భగవాన్‌దాస్, ఉంగటి గోపాల్, కుంచాల సురేష్, రావాడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందిస్తాం

జి.సిగడాం: వాండ్రంగి గ్రామ పంట పొలాలకు మడ్డువలస కాలువ ద్వారా సాగునీరు అందిస్తామని మడ్డువలస ప్రాజెక్ట్ డీఈఈ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మధుపాం నుంచి వాండ్రంగి పంట పొలాలకు సాగునీరు వెళ్లడానికి సుమారుగా రూ.7 లక్షల నిధులతో చేపడుతున్న కాలువ పనులను పరిశీలించారు. ఖరీఫ్‌లో శివారు ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఈఈ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు సాకేటి నాగరాజు, బోగాది అప్పలనాయుడు పాల్గొన్నారు.

రహదారుల భద్రతకు పెద్దపీట

శ్రీకాకుళం పాతబస్టాండ్ : రహదారుల భద్రతపై నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి వర్చువల్‌గా పాల్గొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలాస తదితర చోట్ల సర్వీస్ రోడ్ల నిర్వహణ దయనీయంగా ఉందన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, ముఖ్యంగా పైడిభీమవరం పారిశ్రామికవాడ రహదారి ప్రాంతాన్ని పరిశీలించి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాల దర్యాప్తులో కీలకమైన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, ముఖ్యంగా రాత్రివేళల్లో ఆగిపోతున్నాయని చెప్పారు. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ తివారి స్పందిస్తూ త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ పి.సత్యనారాయణ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విజయ సారథితదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో నాణ్యమైన విద్య


దుర్గారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుండడంతో పాటు ముఖ్యంగా సైన్స్ విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ఉత్తమంగా శిక్షణ అందిస్తున్నట్లు ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి(ఎఫ్ఏసీ) పి.దుర్గారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుతో పాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ రికార్డులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సైన్స్ విద్యార్థులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఎంసెట్ శిక్షణను సైతం అందజేస్తున్నట్లు వెల్లడించారు. సైన్స్ అధ్యాపకులకు సైతం తర్ఫీదు అందిస్తున్నామని, వివిధ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీలతో భర్తీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగినట్లు తెలిపారు. గతేడాది 6,046 మంది ప్రవేశాలు పొందారని, ఈ ఏడాది 6,385 మంది జాయిన్ అయ్యారని చెప్పారు.

సదాశివుని నిర్మలకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న నిర్మల

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సదాశివుని నిర్మల డాక్టరేట్ పూర్తి చేశారు. 'ఉత్తర తీరప్రాంత జిల్లాల్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆంగ్ల భాషా బోధన – అభ్యాస ప్రక్రియపై మూల్యాంకనాత్మక అధ్యయనం' అనే అంశంపై చేసిన పరిశోధనలకుగానూ ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఉపకులపతిగా వ్యవహరిస్తున్న డాక్టర్ ప్రసన్నశ్రీ సారథ్యంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కాగా డాక్టర్ నిర్మల ఇదివరకే అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళం డీసీసీబీ కాలనీలో నివాసం ఉంటున్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

ఎచ్చెర్ల: మండలంలోని బొంతలకోడూరు గ్రామ సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సచివాలయం సిబ్బందికి గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామస్తులకు ఇంతవరకూ మంచిగా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై దాడిని ఖండించాలి


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్మికులపై దాడిని ఖండించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం నగరంలో మస్టర్ పాయింట్ల వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నెల్లూరు కార్పొరేషన్‌లో బలవంతంగా రుద్దుతున్న వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గమని అన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని ప్రయోగించి, అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను కాంట్రాక్టర్లకు బందీలుగా మార్చే కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయవద్దని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించి బలవంతంగా వర్క్ అవుట్ సోర్సింగ్ విధానం అమలుకు ప్రయత్నిస్తే రాష్ట్రమంతా పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.గణేష్, శంకర్ గణేష్, ఎ.శంకర్, మోహన్, యుగంధర్, బి.సరోజ, ఎన్.పార్వతి, టి.ఇందు, మల్లమ్మ, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆటలపోటీలు ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఆటల పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా బుధవారం ప్రారంభించారు. ఈ ఆటలు పది రోజుల పాటు జరగనున్నాయి. తొలిరోజున వాలీబాల్, చెస్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. కాగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది వాలీబాల్, చెస్, క్యారమ్స్, క్రికెట్, కబడ్డీతో పాటు మహిళలకు మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, లెమెన్ అండ్ స్పూన్ వంటి క్రీడలు ఉంటాయని బార్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదరరావులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు పి.భాస్కరరావు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

జి.సిగడాం: గ్రామస్థాయి అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య భార్గవి స్పష్టం చేశారు. మండలంలోని టంకాల దిగ్గువలస గ్రామంలో జ్వరాలపై బుధవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పంచాయతీలో నిధులు లేకపోతే మండల పరిషత్ నుంచి నిధులు తెప్పించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు చేపట్టాలన్నారు. సర్పంచ్ టంకాల జగన్‌మోహిని, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, వైద్యాధికారి డాక్టర్ బుడుమూరు యశ్వంత్, పంచాయతీ కార్యదర్శి అసిరయ్య, ఎంఎల్‌హెచ్‌పీ దివ్యరాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం యూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏఎన్‌ఎంలు నాగమణి, సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ రమాదేవి ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలికలకు రక్తహీనత లేకుండా ముందస్తు చర్యలు కోసం వైద్య పరీక్షలు చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి జాడ సాయి కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

జి.సిగడాం: మండలంలోని టంకాల దిగ్గువలస గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురికి కాలువలో ఉన్న చెత్తా చెదారంను తొలగించారు. ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, సర్పంచ్ టంకాల జగన్‌మోహిని ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. దోమలు నివారణకు మందు పిచికారీ చేశారు. అలాగే టీడీవలస గ్రామంలో జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబింధు వైద్య సిబ్బంది కలిసి ఇంటింటికి వెళ్లి జ్వరాలపై సర్వే చేపట్టారు. వీరితోపాటు పంచాయతీ కార్యదర్శి అసిరయ్య, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా 2025–26, 2026–27 విద్యా సంవత్సరాల్లో బాధ్యతలు నిర్వర్తించేందుకు అర్హులైన ఔత్సాహిక ఫిజికల్ డైరెక్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ–పీఈ), పీఈటీలు దరఖాస్తు చేసుకోవచ్చని, 58 ఏళ్లలోపు వయస్సు, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారిని పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు 3వ తేదీలోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీఈవో వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.